

రొంపిచెర్లలో చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి-రొంపిచెర్ల

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం రొంపిచెర్లలో పర్యటించారు. మంత్రి పెద్దిరెడ్డి వీరంగం వల్ల పీలేరు జైల్లో ఉన్న టిడిపి కార్యకర్తలను ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఇంటి వద్ద సంక్రాంతి వేడుకలలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు కేసులు పెడుతున్నారని, ఇటువంటి చర్యలను ఖండిస్తున్నామని తెలిపారు.



ఎండనకా.. వాననకా.. పశువుల్ని మేపితే...

పాలకు గిట్టుబాటు ఏది..?



• 20శాతం డబ్బు కడితేనే ఇన్సూరెన్స్ క్లైమ్ • రుణాలిచ్చి ఆదుకోవాలని పాడి రైతుల వినతి

ప్రజాశక్తి - పిచ్చాటూరు

ఓ వైపు నిరుద్యోగం.. మరోవైపు గిట్టుబాటు కాని వ్యవసాయం.. అంతోఇంతో రైతు బతుకుతున్నాడంటే పాడి పరిశ్రమ వల్లే.. అయితే ఎండనకా వాననకా పశువుల్ని పగలంతా మేపితే పాలకు గిట్టుబాటు అంతంతమాత్రమే. ఏదైనా అనారోగ్యంతో ఆవు మరణిస్తే రైతు 20 శాతం డబ్బు కడితేనే ఇన్స్యూరెన్స్ క్లైమ్ అవుతోంది.. ప్రైవేట్‌గా లీటర్ ఆవు పాలు 50, గేదె పాలు 60 బహిరంగ మార్కెట్లో అముడుపోతోంది. అయితే రైతన్న దగ్గర నుంచి కేవలం 30-35 రూపాయలే లీటర్‌కు గిట్టుబాటు అవుతుందని పాడి రైతులు వాపోతున్నారు. తమ పిల్లల భవిష్యత్ అయినా బాగుండాలని కష్టపడి పశువులను మేపుతూనే గౌరవంగా పిల్లల్ని ఉన్నత చదువులు చదివిస్తున్నామని పాడి రైతులు చెబుతున్నారు. ఒకరిపై ఆధారపడకుండా గ్రామాల్లో బతకాలంటే పాడి పరిశ్రమే ఆధారం.. పశువులు ఇంట్లో ఉన్నాయంటే వాటికి చాకిరీ చేయడానికే సమయం అంతా సరిపోతుంది. మూగ జీవాలకు సేవ చేయడం ద్వారా గ్రామాల్లో కుటుంబాలకు కుటుంబాలు జీవనాధారాన్ని ఎంచుకున్నాయి. కనుమ పండుగ రోజు 'ప్రజాశక్తి' కొంతమంది పాడి రైతులను కలవగా వారు వారి కష్టాలను వివరించారు.

పిచ్చాటూరుమ ండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఆవులు 6702, గేదెలు 3204, గొర్రెలు 8320, మేకలు 9753, కోళ్లు 21,914 జీవాలు కలిగి ఉన్నాయ. మండలంలో సరాసరి రోజుకు ఏడువేల లీటర్ల పాలను వివిధ రకాలుగా రైతులు అమ్ముతున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన శ్రీజ డెయిరీ పాడి రైతుల దగ్గర తక్కువ ధరకు పాలను కొనుగోలు చేస్తోంది. ఆ పాలలో వెన్న శాతం బట్టి రేట్లు కనిష్టంగా 33 రూపాయల నుంచి గరిష్టంగా 37 రూపాయల వరకు గేదెపాలకు రైతులకు అందిస్తోంద. ఎక్కువమందికి లీటర్ రూ.34గిట్టుబాటు అవుతోంది. అదే ప్రైవేట్ డెయిరీలో వెన్న శాతంతో పాటు 35 రూపాయల నుంచి 40 రూపాయలకు కొనుగోలు చేస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆవులు, గేదెలను మేతకు తీసుకెళ్లి, సాయంత్రం పాలు పితికి చాలా తక్కువ రేట్లకు పాలు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

50శాతం రాయితీతో 'దాణా' ఇస్తున్నాం : డాక్టర్ ధనంజయ్, పశువైద్యాధికారి



పాడి రైతులకు ఉచితంగా వైద్యం చేస్తున్నాం. 50 శాతం సబ్సిడీతో దాణా అందిస్తున్నాం. అలాగే నేలజాతి కట్టు సూదులు వేయాలన్నా ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.40-70 రూపాయలు ప్రభుత్వానికి చెల్లించాలి. గ్రామాల్లో ఉచిత క్యాంపులు నిర్వహించి జీవాలకు వైద్యం అందిస్తున్నాం. ప్రభుత్వం కల్పించిన పథకాలను వివరిస్తూ వీలైనంత వరకూ రూ.20వేల రూపాయలు ఒక ఆవుకు లోనుగా ఇస్తున్నాం.

పాలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి : పార్వతి



మా కుటుంబం మొత్తం ఐదుగురం. చదువు లేదు. పిల్లల్ని చదివించుకోవాలనే ఉద్దేశ్యంతో గేదెలు, ఆవులు కొన్నాను. వీటిద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లల్ని చదివించుకుంటున్నాను. డెయిరీలో తక్కువ రేటు ఇస్తున్నారు. దీంతో డెయిరీలో పోయకుండా టీచర్స్ కాలనీలో పది ఇళ్లు ఒప్పించుకుని పాలు పోస్తున్నాను. లీటర్ ఆవుపాలు 40, గేదెపాలు రూ.50 చొప్పున అమ్ముకుని జీవనం సాగిస్తున్నాను.

పశుక్రాంతి పున్ణప్రారంభించాలి : సుబ్రమణ్యం



రాష్ట్ర ప్రభుత్వం రైతన్నల కోసం తీసుకొచ్చిన పశుక్రాంతి పథకాన్ని పున్ణప్రారంభించాలి. 2007లో అప్పటి కాంగ్రెస్ హయాంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పశుక్రాంతి పథకాన్ని ప్రవేశపెట్టి ఆవులు, గేదెలు, మేకలను, గొర్రెలను ఎస్సీ ఎస్టీ బీసీ కార్పొరేషన్ ద్వారా అందించేవారు. తమిళనాడులో ఆవులను కొనుగోలు చేసి అందజేసేవారు. ప్రస్తుతం ఈ పథకం కనుమరుగయ్యింది. పేత రైతులకు సబ్సిడీతో ఆవులను అందజేయాలి.

పాడిరైతులను ఆదుకోవాలి : పేరయ్య



నా వయస్సు 47 సంవత్సరాలు. నలుగురు పిల్లలు. పొలం రెండున్నర ఎకరా ఉంది. వాటిలోఓ పంట కోసం పెట్టుబడి పెట్టి చాలా నష్టపోయాను. అప్పులపాలయ్యాను. అప్పు తీర్చలేక ఇబ్బంది పడుతున్న సమయంలో పాడిరైతుగా మారాను. నాలుగు గేదెలు కొనుగోలు చేశాను. ఇపుడు 20 గేదెలుగా అభివృద్ధి చెందాయి. బ్యాంకుల ద్వారా రుణాలిచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

'కట్టు'సూది ఉచితంగా ఇవ్వాలి : రాజేంద్రన్



కుటుంబాన్ని పోషించుకునేందుకు ఆవులు కొనుగోలు చేసి మేపుతున్నాను. ఆవులకు మేతతో పాటు అదనంగా దాణా కొనుగోలు చేయాలి. కనిష్టంగా 950 నుంచి గరిష్టంగా 1400 అవుతుంది. ఆవులకు మేలైన జాతి కట్టు సూది వేయాలన్నా వైద్యాధికారులకు రూ.40-70 ఇవ్వాల్సి వస్తోంది. ప్రభుత్వమే ఉచితంగా అందించి ఆదుకోవాలి.



పంట పొలాలపై ఏనుగుల మంద దాడి

చెరకు, మామిడి, మిరప పంటలు ధ్వంసం

ప్రజాశక్తి -సోమల

సదుం మండలం చెరుకువారిపల్లి పంచాయతీ జోగివారి పల్లి పంచాయతీ పరిధిలోని పలువురు రైతుల పంట పొలాలపై ఏనుగుల మంద దాడి చేసి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మార్తూరి వారి పల్లె గ్రామానికి సంబంధించిన గొల్లపల్లికి చెందిన మురళి, లోకనాథం, పెద్దబ్బ అనే రైతులకు చెందిన చెరకు, మామిడి, మిరప పంట పొలాలపై ఏనుగుల మంద శనివారం అర్ధరాత్రి దాడి చేసి పంటలను ధ్వంసం చేశాయి. ఇదే రైతులకు చెందిన పశువుల గడ్డిని పూర్తిగా ధ్వంసం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన చెందారు. ఆదివారం అర్ధరాత్రి జోగి వారి పల్లి పంచాయతీలోని బాబు రెడ్డి, ప్రవీణ్ రెడ్డిలకు చెందిన మామిడి, కొబ్బరి చెట్లను పూర్తిగా ధ్వంసం చేశాయని, పంటల చుట్టూ వేసిన రాతి కూసాల ఫెన్సింగ్ ను ధ్వంసం చేసినట్టు రైతులు తెలిపారు. ఏనుగులు దాడి చేసిన పంట పొలాలను వీఆర్వో పురుషోత్తం వెళ్లి పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి అధికారులకు అందజేశారు. సోమవారం అటవీశాఖ సిబ్బంది ఏనుగుల మంద దాడితో నష్టపోయిన రైతులతో మాట్లాడి పంట పొలాలను పరిశీలించి జరిగిన విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. సంక్రాంతి పండుగ వేళ ప్రజలందరూ ఆనందోత్సాహాలతో ఉండగా తమ పంట పొలాలను ఏనుగులు దాడి చేసి తమకు ఆర్థిక నష్టాన్ని కలిగించడం బాధాకరంగా ఉందని రైతులు ఆవేదన చెందారు. ఏనుగుల భారి నుండి శాశ్వత పరిష్కారాన్ని అధికారులు చూపించాలని ఈ ప్రాంత రైతులు ప్రజలు కోరుతున్నారు.

కుప్పంలో చంద్రబాబు ఓటమి తథ్యం: పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



కుప్పంలో చంద్రబాబుఓటమి తథ్యమని, చిత్తూరు జిల్లాలో చంద్రబాబు కారుకూతలు కూస్తున్నాడని, తన జెండాను మోయలేక పవన్‌కల్యాణ్ చేతికి ఇచ్చాడని ఇంధన, అటవీ, పర్యావరణ శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తిరుపతిలో మీడియాతో పెద్దిరెడ్డి మాట్లాడుతూ తన పార్టీ కార్యకర్తలను గుండాలుగా మార్చి రెచ్చగొట్టే నీచానికి చంద్రబాబు దిగజారాడన్నారు. చివరికి న్యాయమూర్తులపైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కుటిల రాజకీయ నైజం చాటుకున్నాడని విమర్శించారు. పండగ సందర్భంగా పిల్లాజెల్లలతో తాము సంతోషంగా ఉంటే, తమపై రోజూ ఏదో ఒక కారుకూతలు కూస్తున్నాడన్నారు. బషీర్‌బాగ్‌లో రైతులపై కాల్పులు జరిపిన విషయం. అంగన్‌వాడీ మహిళలను గుర్రాలతో తొక్కించిన విషయాన్ని జనం మరచిపోలేదన్నారు. పుంగనూరులో తనపై చంద్రబాబు పోటీ చేయాలని సవాల్ విసిరారు. సిఎం అనుమతిస్తే కుప్పంలో పోటీ చేస్తానన్నారు. జీవో నంబర్ 1 ముందే వచ్చి ఉంటే 11 మంది చనిపోయి ఉండేవారు కాదని అన్నారు. ప్రజల భద్రత కోసమే జీవో తెచ్చామన్నారు.

కొత్త సినిమాతో మీ ముందుకు వస్తా : గల్లా అశోక్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం దిగువమాఘం గ్రామంలో గల్లా కుటుంబ సభ్యులు స్వగ్రామంలో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. రాజన్న మెమోరియల్ పార్కునందు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గల్లా అరుణకుమారి ముద్దుల మనవడు, సినీహీరో గల్లా అశోక్ మొదటి చిత్రం హీరో 1వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ప్రదర్శన చేశారు. గల్లా అశోక్‌ను అభిమానులు భారీ గజమాల వేసి, కేక్‌లు కట్ చేసి సందడి చేశారు. అనంతరం పార్కులో హీరో చిత్రాన్ని ప్రదర్శించారు. అవ్వా తాతలతో కలిసి దిగువమాఘం గ్రామంలో సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని గల్లా అశోక్ అన్నారు. త్వరలోనే కొత్త సినిమాతో అభిమానుల ముందుకు వస్తానని వెల్లడించారు. మామయ్య మహేష్‌బాబు ప్రోత్సాహంతో సినిరంగంలో ముందుకెళతానని అన్నారు. తన మనవడ్ని ఆశీర్వదించాలని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అన్నారు. రాజకీయాలపై 'నో కామెంట్' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో గల్లా రామచంద్రనాయుడు, గల్లా పద్మ, గౌరినేని రమాదేవి, గల్లా సిద్దార్థ, అమరరాజా డైరెక్టర్స్ గౌరినేని హర్ష, విక్రమ్ పాల్గొన్నారు.



దిగువమాఘంలో 'గల్లా' కుటుంబీకుల సంబరాలు



ముంబాయి మారథాన్‌లో మెరిసిన ఎస్ఐ రామకృష్ణ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పనిచేస్తున్న రామకృష్ణ ముంబాయి మారథాన్‌లో తన ప్రతిభను చూపించారు. ఆదివారం ముంబైలో జరిగిన టాటా గ్రూప్ మారథాన్ ను 4.19 గంటల సమయంలో పూర్తి చేసి సత్తా చాటారు. మొత్తం 42.2కిలోమీటర్ల దూరాన్ని రామకష్ణ 4.19 గంటల్లో పూర్తి చేశారు. స్వతహాగా బ్యాడ్మింటన్ క్రీడతో పాటు దేశంలో మారథాన్ ఎక్కడ జరిగిన పాల్గొనే రామకష్ణ తొలిసారిగా సంపూర్ణ మారథాన్లో పాల్గొని విజయాన్ని అందుకున్నారు. ఈ ఫీట్ సాధించినందుకు ఎస్ఐ రామకృష్ణను చిత్తూరు ఎస్పీ రిశాంత్ రెడ్డి, డిఎస్పి శ్రీనివాస మూర్తి , సిఐ మద్దయ్య ఆచారి ప్రత్యేకంగా అభినందించారు.

దాడులతో టీడీపీ విజయాన్ని అడ్డుకోలేరు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

దాడులు దౌర్జన్యాలతో టీడీపీ విజయాన్ని అడ్డుకోలేరని ఎమ్మెల్సీ దొరబాబు అధికార వైకాపా నేతలను హెచ్చరించారు. ఆదివారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో తెలుగుదేశం నేతలపై అక్రమ కేసులు పెట్టి అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని, 10 రోజుల వ్యవధిలో 40 మందిపై అక్రమ కేసులు బనాయించినట్లు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకాలు మితిమీరిపోతున్నాయని నియోజకవర్గంలో నియంతల వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మంత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకొస్తే షుగర్ ఫ్యాక్టరీ, విజయ డెయిరీ తెరిపిస్తానని మాట ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని తెలిపారు.

ఐక్యంగా గాలిపటాలు ఎగరేద్దాం : ఎంఎల్ఏ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

సంక్రాంతి సందర్భంగా కట్టమంచి చెరువు పై నున్న వివేకానంద ఉద్యానవనంలో గాలిపటాలు ఎగరేసే పండుగను చిత్తూరు శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. మన పండుగలే మన ఐక్యత ను చాటుతాయని, మనందరి మద్య బందాలను పెంచి ,మనకు సంతోషం కలిగిస్తాయని,ఇలా చిత్తూరు లో సామూహికంగా గాలిపటాలు ఎగరేసే కైట్ ఫెస్టివల్ ను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని ఎంఎల్ఏ శ్రీనివాసులు మాట్లాడారు. వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షుడు జయకుమార్ మాట్లాడుతూ చిత్తూరు యువత కైట్ ఫెస్టివల్, యూత్ ఫెస్టివల్ లాంటి వాటి ద్వారా సమాజసేవ చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కైట్ ఫెస్టివల్ లో వందలాది మంది ఉత్సాహంగా పాల్గొని గాలిపటాలు ఎగరేసే ఆనందోత్సాహాలు ఒకరితో ఒకరు పంచుకొని సంతోషం గా గడిపారు. ఈకార్యక్రమంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మాధవరెడ్డి, వివేకానంద ఫౌండేషన్ సభ్యులు శరశ్చంద్రశేఖర్, దరణి, వేలు, హేమంత్, పురప్రముఖులు ఆరణి కవిత, ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలు శివ, రమేష్ పాల్గొన్నారు.



పోలీసులు... ప్రజాప్రతినిధుల సాక్షిగా..

రంగంపేటలో కోడిగిత్తల రంకెలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సంక్రాంతి పండుగ మూడవరోజు కనుమ పండుగ సందర్భంగా చంద్రగిరి మండలం రంగంపేటలో జల్లికట్టు సంబరాలు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పశువుల జోరుకు యువకులు బేజారు పడగా పదిమంది యువకులకు గాయాలయ్యాయి. జల్లికట్టు ఉత్సవాలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి, మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, చంద్రగిరి టీడీపీ ఇన్చార్జీ పులివర్తి నాని రంగంపేటలో హాజరయ్యారు. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూశారు.

పశువుల పండుగ సందర్భంగా రంగంపేట గ్రామంలో శుక్రవారం ఉదయం గ్రామ కులదేవత కాటమరాజుకు గ్రామస్థులు పూజలు చేశారు. అనంతరం కాటమరాజ అలయం నుంచి కత్తిని ఊరేగింపుగా తీసుకొచ్చి పశువుల కొట్టం వద్ద విశేష పూజలు చేశారు. అనంతరం పశువుల కొమ్ములను అందంగా అలంకరించి వాటి కొమ్ములకు చెక్కపలకలు, టవళ్ళు, ఇతర బహుమతులు కట్టారు. పశువుల కొమ్ములకు ఉన్న బహుమతులను చేజిక్కించుకొనేందుకు వేలాదిమంది ఇతర గ్రామాల నుంచి యువకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. పండుగను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చారు. పశువులను ముస్తాబు చేసిన తర్వాత ఉత్సహంగా గ్రామ యువకులు పశువులను యువకులపై వదలిపెట్టారు. పశువులను నిలువరించేందుకు యువకులు కొంత ఇబ్బంది పడ్డారు. ఈతరుణంలో దాదాపు 10మంది యువకులకు గాయాలైయ్యాయి. కొంతమంది పశువులను నిలువరించి, వాటి కొమ్ములకు ఉన్న బహుమతులను చేజిక్కించుకొని విజయ గర్వంతో కేరింతలు కొట్టారు. కొన్ని పశువులు తప్పించుకొని పరుగులు పెట్టడంతో పశువుల యాజమానులు పశువులకు జేజేలు చెప్పారు.

చెవిరెడ్డి అభివాదం

కనుమ పండుగ సందర్భంగా జల్లికట్టు సంబరాలు తిలకించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, హాజరయ్యారు. జల్లికట్టుకు వచ్చిన ప్రజలకు అభివాదంచేశారు. ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని హాజరై ప్రజలకు అభివాదం చేశారు.

అన్నదానం

జల్లికట్టు సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అశేష జన వాహిని కి, రంగంపేటకు చెందిన బోస్ చంద్రారెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. పులిహోర ప్యాకెట్ లను, వాటర్ ప్యాకెట్ లను అందజేసి ఆకలి తీర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు , గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పలుగ్రామాలలో జల్లికట్టు సంబరాలు

పండుగను పురస్కరించుకొని చంద్రగిరి మండలంలో అరిగెలవారిపల్లి, రామచంద్రాపురం మండలం బొప్పరాజుపల్లి పరుషపందాలు జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పశువులను అందంగా ముస్తాబు చేసి, కొమ్ములకు బహుమతులు కట్టి యువకులపై వదిలారు.



పోలీసులు ప్రేక్షక పాత్ర

జల్లికట్టు సంబరాలు సందర్భంగా జల్లికట్టు నిర్వహించకూడదని పోలీసులు ఆదేశాలు జారీ చేయడంతో గ్రామస్తులు ఏమాత్రం పట్టించుకోలేదు. దాదాపు 200 మంది పోలీసులు రంగంపేటకు వచ్చిన జల్లికట్టు ఆపలేక ప్రేక్షకులుగా మారిపోయారు. ప్రతి సంవత్సరం పశువుల పండగ ఆనవాయితీగా జరుపుతున్నామని, ఈ సంవత్సరం జరకుంటే గ్రామానికి అరిష్టం జరుగుతుందని గ్రామస్థులు జల్లికట్టు నిర్వహించారు. దీంతో పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ గ్రామస్తులు జల్లికట్టు సంబరాలు నిర్వహించారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ జల్లికట్టును తిలకించారు. ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్లియర్ చేశారు.

మాట ఇచ్చారు.. రోడ్డేశారు..!



ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పంలోని మొండివెంగనపల్లి సర్పంచ్ పోటుగారి లలితాభాస్కర్ ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 7న జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట ఇచ్చారు. బండమీదఇండ్లు గ్రామానికి వెళ్లే రోడ్డు మరమ్మతు చెయ్యాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని గ్రామస్థులు కోరారు. ఇందుకు స్పందించిన సర్పంచ్ పోటుగారి లలితా భాస్కర్ సోమవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీంతో మొండివెంగనపల్లి పంచాయతీ ప్రజలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సంప్రదాయాలకు ప్రతీకగా రంగవల్లులు



ప్రజాశక్తి-కార్వేటినగరం: సంస్కృతి.. సంప్రదాయాలకు ప్రతీక రంగవల్లులు అని వైసీపీ మండల పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ అన్నారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ సన్నిధి వీధిలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కనుమ పండుగను పురస్కరించుకుని సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర నేతలు గాజుల నాగేశ్వరరావు, హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రంగవల్లులు ఒక కళ అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ డంకా హమీద్‌బాషా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతున్న సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు మొదటి బహుమతిని పీలేరు రూరల్ సీఐ మర్రి తులసీరామ్, రెండో బహుమతి టీచర్ దేవయ్య, మూడో బహుమతి హేచంద్రారెడ్డి, కన్సోలేషన్ బహుమతులు మండల ఎస్టీయూ నాయకుడు నాగేంద్రరాజు, రజింత్,కుమార్ అందించారు. రంగవల్లులలో ప్రతిభ చూపిన వారిలో మొదటి బహుమతి కోమల, రెండో బహుమతి జ్యోతి, మూడో బహుమతిని యశస్విని గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు యువరాజు, చంద్రశేఖర్, పయని, సుబ్రమణ్యం, సర్దార్, శేఖర్, విజయకుమార్ పిళ్లై, లక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన బంగారుపాళ్యం నాయకులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, నందమూరి బాలకష్ణలను ఆదివారం చంద్రగిరి మండలం నారావారిపల్లెలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఈడిగ బీసీ సాధికార సమితి కన్వీనర్ బుసా నాగరాజగౌడ్ కలసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. బీసీలందరూ పార్టీ విజయానికి కషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈడిగ బీసీ సాధికారత సభ్యులు రెడ్డెప్ప గౌడ్, వెంకటేష్‌గౌడ్, బీసీ నాయకులు దీనదయాళ్ గౌండర్, వి.బాబు, ప్రసాద్, మురళీ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నిర్మాణ పనుల పరిశీలన




ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లె వద్ద రిజర్వాయర్ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయనను కలిసి రిజర్వాయర్ నిర్మాణంతో తాము వ్యవసాయ భూములను నష్టపోతున్నామని.. తమకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మిధున్ రెడ్డి మాట్లాడుతూ ఏ ఒక్క రైతుకు నష్టపరిహారం విషయంలో అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని, ఎంత మేర అవకాశం ఉంటే అంతవరకు నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు రైతులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలలో పలమనేరు పీఎల్ టీం విజేతగా నిలిచింది. పలమనేరు నియోజకవర్గ పరిధిలోని 24 టీమ్‌లు క్రికెట్ పోటీలలో పాల్గొనగా సెమీ ఫైనల్‌కు పీపీఎల్ టీమ్ చేరుకొంది. అలాగే ఫైనల్‌లో సోమవారం పలమనేరు పీపీఎల్ టీమ్ విజేతగా నిలిచింది. విజేతలకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంజిత్‌షా బహుమతులు అందించారు.

భక్తులతో కిటకిటలాడిన ఆరిమాను గంగమ్మ దేవాలయం



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని చిత్తూరు-పుత్తూరు రోడ్డు పక్కన ఆరిమాకులపల్లిలో వెలసిన కార్వేటినగరం మహారాజా వారి ఇలవేల్పు ఆరిమాని గంగమ్మ ఆలయం కనుమ సందర్భంగా సోమవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం సుమారు లక్ష మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటాచలపతి బందం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్టీసీ ఉపాధ్యక్షుడు విజయానందరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో తిమ్మారెడ్డి, నిర్వాహకులు రమణ ప్రసాద్ రెడ్డి, ఛైర్మన్ లింగారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. శ్రీరంగరాజపురం ఎస్ఐ షేక్షావలి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు.

బతుకు బండి సాగేదెలా..!

- పూల తోరణాల అమ్మకంతోనే జీవనం
- వచ్చిన ఆదాయంతోనే పిల్లల చదువులు
- తిరునాళ్లలోనూ విక్రయాలు తగ్గుముఖం
- ప్లాస్టిక్ నిషేధంతో అయోమయం

ప్లాస్టిక్ పువ్వులు.. దండలు.. తోరణాల తయారీ.. విక్రయాలే వారి జీవనం. ఊర్లో వంద కుటుంబాలకు పైగా అదే జీవనాధారం. పండుగలు, తిరునాళ్లు, ఉత్సవాల సమయాల్లోనే అంతంతమాత్రం వ్యాపారం. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి వారిది. ఊరూరా తిరిగి అమ్మకాలు చేపడుతూ పూట గడుపుకుంటున్న వారు ప్రభుత్వ నిర్ణయంతో అయోమయంలో పడ్డారు. ప్లాస్టిక్ నిషేధం పేరుతో ఆంక్షలు విధించడంతో అమాంతం వారి వ్యాపారం పూర్తిగా పడిపోయింది. దీంతో దిక్కుతోచని స్థితిలో తమిళనాడుకు వలసలు వెళ్లే పరిస్థితి నెలకొనడం గమనార్హం.

- ప్రజాశక్తి-వెదురుకుప్పం



తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మరాలీపురం గ్రామానికి చెందిన సుమారు 100 కుటుంబాలకు పైగా ప్లాస్టిక్‌తో తయారు చేసిన తోరణాలు, దండలు, పువ్వులు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. తమ పూర్వీకుల నుంచి అదే వ్యాపారాన్ని కొనసాగిస్తూ తమ బతుకుబండిని కొనసాగిస్తున్నారు. ప్లాస్టిక్ తోరణాలు.. దండలు ఆకర్షణీయంగా ఉండటంతో మంచి గిరాకీ ఉండేది. ఇళ్లల్లో అలంకరణకు సైతం అధికంగా కొనుగోలు చేసుకునే వారు. గతంలో మన పూర్వీకులు సంక్రాంతి పండుగలకు అయితే ఎక్కువగా మామిడి ఆకులు, అరటిమానులను కట్టేవారు. అయితే ప్రస్తుతం వాటి స్థానంలో ఈ ప్లాస్టిక్ దండలు వచ్చాయి. వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా ఉండేది. వీటి తయారీకి కావాల్సిన ముడి సరకులను చెన్నై, హైదరాబాదు, విశాఖపట్నం ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తీసుకొస్తారు. ఇంటి వద్ద కుటుంబ సమేతంగా వాటిని తోరణాలు, దండల రూపంలో తయారు చేసివ్వడంతో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాల్లో ఎక్కడ పండుగలు, జాతరలు జరిగినా వెళ్లి విక్రయాలు చేస్తుంటారు. అక్కడకు స్కూటర్ సహాయంతో తీసుకెళ్లి అమ్ముకుంటారు. వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణతోపాటు తమ పిల్లల చదువులకు ఉపయోగించేవారు. ఈ వ్యాపారమే వారికి ఓ జీవన మార్గం. ఇక వేరే పని చేయడం వారికి చేతరాదని అంటున్నారు. మూడు అడుగుల దండను తయారు చేయడానికి సుమారు రూ.40 ఖర్చవుతుందని, తిరుణాళ్లలో రూ.60 లకే విక్రయిస్తామంటున్నారు. గ్రామంలో కొందరికి తమ పెద్దలు సంపాదించిన పొలాలున్నా.. అవి గొడవల్లో ఉన్నాయని.. తాము పొలాలను పైరు చేసుకునే వీలుకూడా లేదని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ప్లాస్టిక్ నిషేధం అంటుండటంతో దిక్కుతోచని స్థితిలో పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎలా బతకాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నామని.. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వమే మాకు మార్గం చూపాలి



రోజురోజుకి ప్లాస్టిక్ తోరణాలు. దండల వ్యాపారంలో ఆదరణ తగ్గిపోతుంది. కుటుంబ పోషణ భారంగా ఉంది. మేము కష్టపడి తయారీ చేసి ఊరూరా తిరిగినా కొనే వారు సైతం తక్కువయ్యారు. కష్టానికి తగిన ఫలితం లేదు. తాము అగమ్యగోచరంగా ఉంటున్నారు. ప్రభుత్వం స్పందించి మా గ్రామానికి వచ్చి విచారించి మాకు వేరే మార్గాన్ని చూపి ఆదుకోవాలి.

- బి.లింగా, మరాలీపురం, ఏర్పేడు మండలం

వ్యాపారం కష్టతరంగా ఉంది



పదేళ్ల క్రితం ఈ వ్యాపారానికి మంచి ఆదరణ ఉండేది. తిరుణాళ్ల, జాతర్లలో ఈ దండలను ఎక్కువగా కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం గ్రామస్థులు రోజురోజుకీ వీటిని కొనుగోలు చేసేవారు తగ్గుతున్నారు. వ్యాపారం తగ్గుముఖం పట్టడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్లాస్టిక్ నిషేధంతో అయోమయంలో పడ్డాం. ప్రభుత్వం ప్రత్యేక మార్గం చూపి మమ్మల్ని ఆదుకోవాలి.

- బి.సాయి, మరాలీపురం, ఏర్పేడు మండలం

ఊరంతా కనుమ పండుగ



ప్రజాశక్తి-వెదురుకుప్పం: సంక్రాంతి పండుగల్లో కనుమ పండుగ ప్రధానం. వెదురుకుప్పం మండలంలో సోమవారం కనుమ పండుగను ఊరూరా ఘనంగా జరుపుకున్నారు. రైతులతోపాటు పాడిరైతులు ఎంతో ఉత్సాహంతో పాడి ఆవులు, ఎద్దులకు స్నానాలు చేయించి కొమ్ములకు రంగులద్ది.. వివిధ రకాల పూలతో అలంకరించి పొంగళ్లు పెట్టారు. పశువులకు పూజలు చేసి హారతులు పట్టారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ పాడి పంటలతో సమద్ధిగా ఉండాలని కోరుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.

ప్రజాశక్తి-సోమల: సంక్రాంతి పండుగ పర్వదినాన్ని మండలంలోని పలు పంచాయతీల పరిధిలోని గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. మొదటి రోజు భోగి పండుగను, రెండో రోజు సంక్రాంతి పండుగ సందర్భంగా పెద్దలకు నూతన వస్త్రాల సమర్పణ నిర్వహించారు. మూడో రోజు కనుమ పండుగ సందర్భంగా పశువులను అందంగా అలంకరించి పూజలు చేపట్టారు. సాయంత్రం చిట్లకుప్ప వద్ద భారీ అగ్ని కీలల చుట్టూ ఆవులను ప్రదక్షిణలు చేయించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెద్దపంజాణి: సంక్రాంతి పండుగను సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి స్వగ్రామం కెళవాతి గ్రామంలో వారి కుటుంబ సభ్యులతో కలిసి కనుమ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవులకు ఇంట్లో పూజలు నిర్వహించి గ్రామస్థులతో కలిసి సంక్రాంతి కనుమ పండుగను జరుపుకున్నారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా గోవులతో గ్రామ పులిమేర వరకు ఊరేగింపు చేపట్టారు.



యువతను రెచ్చగొట్టడం మానుకోవాలి



ప్రజాశక్తి-రొంపిచెర్ల: యువతను రెచ్చగొట్టడం టీడీపీ మానుకోవాలని ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డిపై గెలవలేక యువతను మాజీ సీఎం చంద్రబాబునాయుడు, టీడీపీ నాయకులు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు పనిచేసినా చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డిని ఏమి చేయలేకపోయారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి ముస్లింల పక్షపాతి అన్నారు. రొంపిచెర్లకు చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు వినాయకులు అనారోగ్యంతో మతిచెందితే మంత్రి పెద్దిరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.10 లక్షలను మంజూరు చేసి పంపిణీ చేశారని తెలిపారు. సబ్ జైల్లో ఉన్న కరీం తండ్రి జానీబాషా మతి చెందితే వైయస్సార్ బీమా పథకం లో రూ.2 లక్షలను మంజూరు చేశారన్నారు. చంద్రబాబు సీఎంగా ఉండగా చిత్తూరు జిల్లాలో ముస్లిం సోదరులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.10 లక్షలు ఎవరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. మంత్రి పెద్దిరెడ్డిని ఓడించడం చంద్రబాబు తరం కాదన్నారు. నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి వార్డు మెంబర్‌గా కూడా గెలవలేదన్నారు. చల్ల బాబుతో కలిసి పుంగనూరు నియోజకవర్గంలో యువతను రెచ్చగొడుతూ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. జడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన రొంపిచెర్లలో జరిగిన ఘర్షణలకు చల్లా బాబు, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి బాధ్యత అన్నారు. పీలేరు నుంచి టీడీపీ రౌడీలను రొంపిచెర్లకు పంపి దాడులు చేయించారని ఆరోపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ విజయశేఖర్‌బాబు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సలీం బాషా, సర్పంచ్ నాగిరెడ్డి, నాయకులు సూర్యనారాయణ రెడ్డి, జిల్లా మైనార్టీ కార్యదర్శి సైదుల్లా ఖాన్,కరీముల్లా, అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

రాస్ వృద్ధాశ్రమంలో యువత అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: యువత ఆధ్వర్యంలో రాస్ వద్ధాశ్రమంలోని వద్ధులకు సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ మండల కన్వీనర్ ధనంజయవర్మ మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా పలు పట్టణాల్లో స్థిరపడి సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి చేరుకున్న చిన్ననాటి స్నేహితులు సోమవారం వద్ధులపై ఆప్యాయతతో అన్నదానం చేశారు,. వారితో కలిసి సంక్రాంతి పండుగ వేడుకలను జరుపుకున్నారు. ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి వద్ధులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వద్ధులకు అన్నదానంతో పాటు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు.



కార్యక్రమంలో వేలురెడ్డి, దామోధరరెడ్డి, రమేష్, కిషోర్, భూపాల్, పలువురు చిన్ననాటి స్నేహితులు పాల్గొన్నారు.

'మన నాయకుడు' నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'మన నాయకుడు' క్యాలండర్లను సోమవారం నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా పుత్తూరులో ఆవిష్కరించారు. ఆయనతోపాటు నియోజకవర్గ పరిశీలకులు చెన్నూరు సుధాకర్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కోసం ఐటీడీపీ యువత కషి చేయాలని, సామాజిక మాధ్యమాలలో మరింత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛందంగా అందరూ టీడీపీ గెలవాలని పనిచేస్తున్నారని.. వారిని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో అధికారపక్షం వైసీపీ ప్రభుత్వంతో అన్ని రకాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. వారి కష్టాలు తొలగాలంటే టీడీపీ ప్రభుత్వం రావడానికి ఐటీడీపీ సభ్యులు కషి చేయాలని పిలుపునిచ్చారు. 2500పైగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు చేపట్టి రాష్ట్ర వ్యాప్తంగా 50వ ర్యాంకు సాధించిన పుత్తూరు పట్టణ ఐటీడీపీ కోఆర్డినేటర్ ఈశ్వర్ యాదవ్ ను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి జి.గోపీనాథ్, నగరి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు తాళ్లూరి ప్రసాద్‌బాబు, ప్రధాన కార్యదర్శి కృష్ణన్, సభ్యులు ధనంజయులు, లీలాప్రసాద్, ఈశ్వర్ యాదవ్, మాతయ్య, చంద్రశేఖర్ రెడ్డి, జగత్ సాయి, సుధాకర్ యాదవ్, నవీన్, వెంకటేష్ ప్రసాద్, దామా సునీల్, బి.సుధాకర్, లోకేష్, తనిగైవాసన్, మహేష్, ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.



నేడు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పర్యటన

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని శెట్టేరి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు పర్యటించనున్నట్లు ఎంపీడీవో హరి ప్రసాద్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని సమస్యలను తెలుసుకునేందుకు ఇంటింటికీ పర్యటిస్తారని.. గ్రామస్థులు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు వేమన పద్య పోటీలు

ప్రజాశక్తి-పలమనేరు: తెలుగు సాహిత్య, సాంస్కతిక సమితి ఆధ్వర్యంలో జనవరి 18వ తేదీన వేమన పద్య పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు పి.తులసినాథంనాయుడు తెలిపారు. స్థానిక కళామందిరంలో ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని.. ఎక్కువ పద్యాలు చెప్పిన 15 మందికి నగదు బహుమతితోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. వందకు పైగా వేమనశతక పద్యాలు తెలిసిన వారందరూ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

టీడీపీ బీసీ సీనియర్ నాయకుడికి తండ్రి వియోగం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని మహదేవమంగళం గ్రామానికి చెందిన జిల్లా టీడీపీ బీసీసెల్ మాజీ కార్యదర్శి నటరాజ్ మొదలి తండ్రి సంజీవ మొదలి (88) అనారోగ్యంతో ఆదివారం అర్ధరాత్రి మరణించారు. సంజీవ మొదలికి అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం మహాదేవమంగళంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: యువత క్రీడలపై ఆసక్తి చూపాలని ఎన్.ఆర్.ఐ విక్రమ్ అన్నారు. ఆదివారం నలగంపల్లెలోని తన స్వగహంలో క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఆయన తండ్రి బాలరాజునాయుడు జ్ఞాపకార్థం గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని.. ఈ క్రమంలో పంచాయతీకి చెందిన 10 టీమ్‌లకు రూ.30 వేలు విలువైన క్రీడా పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శివ, శివాజీ, విజయ్‌కుమార్, మనోజ్‌కుమార్, గ్రామ యువత, క్రీడాకారులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో ఏటి పండుగ ప్రారంభం



ప్రజాశక్తి-నాయుడుపేట: సంక్రాంతి పండుగ సందర్భంగా ఏటా నాయుడుపేట స్వర్ణముఖి నదిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఏటి పండుగ సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. నాయుడుపేటలో నిర్వహించే ముఖ్యమైన పండుగలలో ఏటి పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. జనవరి నెలలో సంక్రాంతి తర్వాత కనుమ పండుగ నుంచి మూడు రోజుల పాటు ఒక్క నాయుడుపేట వారే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని ఆనందంగా గడుపుతారు. పండుగ జరుపుకోవడం కోసం ఎంతో దూరప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తున్న వారు చేరుకుంటారు. ఈ వేడుకలో ఎన్నో ఏళ్ల స్నేహితులు మళ్లీ కలుసుకుని వారి స్నేహాలను నెమరువేసుకోవడం.. ఒకరితోఒకరు యోగక్షేమాలు పంచుకోవడం కనిపిస్తుంది. పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన పాట కచేరీలు, డ్యాన్స్ ప్రోగ్రాంలు, జబర్దస్త్‌లోని ఆర్టిస్టులతో నిర్వహించే కామెడీ ప్రోగ్రాంలు చాలా సరదాగా జరుగనున్నాయి.

ముగ్గుల పోటీల్లో ప్రతిభ


ప్రజాశక్తి-కేవీబీపురం: మండలంలోని రాయపేడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. సీపీఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్, సోషల్ వర్కర్ దాసరి రఘు చేతుల మీదుగా బహుమతులు అందించారు.

సాధారణ సమాచారం

కర్ణాటక మద్యం స్వాధీనం



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: పాతపేట పంచాయతీలోని శివాలయంలో మద్యం విక్రయిస్తున్న కాలెప్ప అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకటనరసింహులు తెలిపారు. 72 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



ప్రజాశక్తి-చౌడేపల్లె: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని చౌడేపల్లి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఏఎస్ఐ వాసు కథనం మేరకు.. మండలంలోని ఆమినిగుంటకు చెందిన జి.మునివెంకటప్ప కుమారుడు జి.సుధాకర్ (42) గ్రామ సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.2,518 విలువచేసే 90 కర్ణాటక సిల్వర్ కప్ మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు

ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని వేల్కూరు వద్ద ఓ మోటార్ సైకిల్‌ని మరో మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఓ వ్యక్తి రోడ్డుపై పడి ఆదివారం అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం.. కడపగుంట గ్రామానికి చెందిన నాగరాజు బోయడు అలియాస్ నాగరాజు(38) స్నేహితుడు ధర్మతోపాటు మోటారు సైకిల్లో చిత్తూరుకు వెళ్తుండగా వేల్కూరు వద్ద మళ్లీ గంగాధరనెల్లూరుకు వెళ్లాలని మోటార్‌సైకిల్ ని ధర్మ తిప్పుకుంటుండగా అదే సమయానికి చిత్తూరు వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు కలిసి మోటార్ సైకిల్‌లో వస్తూ ముందు వెళుతున్న మోటార్ సైకిల్ ని ఢీకొన్నారు. ప్రమాదంలో ధర్మా నడుపుతున్న మోటార్ సైకిల్‌లో వెనుక ఉండే వ్యక్తి నాగరాజు బోయడు రోడ్డుపై పడి తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంలో చిత్తూరు నుండి వస్తున్న మోటార్ సైకిల్ లోని వ్యక్తులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తమిళనాడులోని సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఆంజనేయరెడ్డి తెలిపారు.



పోలీసుల విధులకు ఆటంకం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని టేకుమంద గ్రామస్థులు పశువుల పండుగ జరుపుకున్నారు. అనుమతి లేకుండా జల్లికట్టు నిర్వహించరాదని సూచించిన పోలీసులను గ్రామానికి చెందిన యువత దాడి చేయడంతో నలుగురిని అదుపులో తీసుకొని కేసులు నమోదు చేశారు.

ఆక్రమణలో కలగటూరు రహదారి


ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని కలగటూరు నుంచి కల్లుపల్లి వెళ్లే రహదారిని కొందరు తమ సొంతభూమిలా ఆక్రమించుకున్నారని..బ్రిటిష్ కాలం నాటి నుంచి ఉన్న దారిని ఆక్రమించుకోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

డివైడర్‌పైకి కారు.. తప్పిన పెనుప్రమాదం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తిరుపతి నుంచి పుత్తూరు మీదుగా చెన్నై వెళ్తున్న కారు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో పుత్తూరు పట్టణంలోని ఎన్జీవో కాలనీ వద్ద డివైడర్‌పైకి దూసుకెళ్లింది. అయితే కారు వెంటనే ఆగిపోవడంతో ప్రమాదం తప్పింది. డివైడర్ ఉన్నట్లు ఎలాంటి సూచిక బోర్డులు.. స్టిక్కర్లు లేనందున ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు.

మోటార్ వైర్లు చోరీ.. ఇద్దరి అరెస్టు




ప్రజాశక్తి-బీఎన్‌కండ్రిక: లక్ష్మీపురం ఎస్టీ కాలనీ వద్ద ఎస్సై మంజునాథరెడ్డి తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా సోమవారం ఉదయం కొత్తకండ్రిక గ్రామానికి చెందిన మణి, గంగయ్యలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారంతో మోటార్ సైకిల్‌పై రెండు సంచులలో చోరీ చేసిన సామాగ్రిని శ్రీకాళహస్తి మార్గం వైపు తరలిస్తుండగా పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు. ఎస్సై మంజునాథరెడ్డి, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మధుబాబు, గణపతి, నాగరాజు, కానిస్టేబుల్ రమేష్ ప్రభాకర్, సురేష్, నమో రంగ, అరుణ్, రంగా కుమార్‌లను శ్రీకాళహస్తి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి విశ్వనాథం అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

ప్రజాశక్తి-రేణిగుంట: హైదరాబాదు నుంచి తిరుమలకు వస్తున్న సమయంలో ఆదివారం మామండూరు సమీపంలో ఆగి ఉన్న లారీని ఇన్నోవా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందినట్లు రేణిగుంట పోలీసులు తెలిపారు. పలువురు గాయపడటంతో వారిని రుయాకు తరలించారు. నగేష్(47), శ్రావణ్‌కుమార్(25) మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండచుట్టు కోసం ఏర్పాట్లు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : కళ్యాణపురం ఎదురుగా మంగళవారం జరుగనున్న కొండ చుట్టు పండుగ సందర్భంగా సోమవారం మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, కౌన్సిలర్లు చిట్టిబాబు ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేశారు. జేసీబీతో స్థలాన్ని చదును చేసి కొండచుట్టుకు వచ్చే భక్తులకు అనుకూలంగా పనులు చేయించారు.